


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 581 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 10 సోమవారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం


## ముసలమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన పవన్ కళ్యాణ్

- కుంకీ ఏనుగుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించిన ఉప ముఖ్యమంత్రి
- ఆకట్టుకున్న మదపుటేనుగులను కట్టడి చేసే విన్యాసం
- కుంకీలకు స్వయంగా ఆహారం అందించిన పవన్ కళ్యాణ్
- కుంకీల బాధ్యత చూసే మావటీలకి ఉప ముఖ్యమంత్రి రూ.50 వేలు బహుమానం
- మియావకీ ఫారెస్ట్ ప్లాంటేషన్ కు శ్రీకారం
- అధునాతన సోలార్ ఫెన్సింగ్ వ్యవస్థకు పునాది రాయి

2



ముసలమడుగు, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 09 : మదపుటేనుగుల దాడుల నుంచి పంట పొలాలను, మనుషులను రక్షించేందుకు ప్రత్యేకంగా కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ కు తీసుకువచ్చిన కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదివారం సందర్శించారు.



## మాగంటి గోపీనాథ్ మరణంపై మాకు అనుమానాలు ఉన్నాయి

- గోపీనాథ్ తల్లి మహానందకుమారి సంచలన వ్యాఖ్యలు
- గోపినాథ్ తల్లి, గోపినాథ్ మొదటి భార్య, కొడుకు పత్రికా సమావేశం



3

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై ఆయన తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తోందని, తమకు అనుమానాలున్నాయని అన్నారు. ఆయన ఎప్పుడు చనిపోయారన్నది తల్లిగా తనకే తెలీదన్నారు. 'జూన్ 6న చనిపోయారా..? 8న చనిపోయారా?' అన్నదీ సందేహంగానే ఉందన్నారు.

## బొప్పన జయవర్ధన్‌కు జన్మదిన శుభాకాంక్షలు..

-సింహగర్జన యాజమాన్యం



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : బొప్పన విష్ణు తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఈ పేరు తెలియని వారు ఉండరు. సినీ నటుడిగా, విబి ఎంటర్టైన్మెంట్స్ అధినేతగా, నిర్మాతగా, మా అసోసియేషన్ ఈసీ మెంబర్ గా అందరికీ సుపరిచితులే. ఆయన సినీ కార్మికుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. నేడు శ్రీమతి & శ్రీ బొప్పన శ్రీదేవి విష్ణు పుణ్య దంపతుల జ్యేష్ఠ కుమారులు చిరంజీవి బొప్పన జయవర్ధన్ 5వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భాన చిరంజీవి బొప్పన జయవర్ధన్ కు సింహగర్జన పత్రిక యాజమాన్యం తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. తండ్రి బాటలోనే తనయుడు కూడా నడవాలని, సంపూర్ణ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనసారా కాంక్షించే, మీరు అభిమానించే సింహగర్జన పత్రిక యాజమాన్యం.

## గొల్లపూడి ఏఎంసిలో రూ.1.50 కోట్లతో అంతర్గత రోడ్ల అభివృద్ధి

- శంఖుస్థాపన చేసిన ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, వసంత కృష్ణప్రసాద్
- ధాన్యం కొనుగోళ్ళకు శ్రీకారం

విజయవాడ రూరల్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 1.50 కోట్లతో అంతర్గత రహదారుల అభివృద్ధికి ఆదివారం శంకుస్థాపన చేశారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం గొల్లపూడి మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు విక్రయానికి తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రైతులు, ప్రజల బహిరంగ ప్రయోజనాల కోసం ఇక్కడ రూ. 10.35 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మార్కెట్ యార్డుకు శాశ్వతంగా ఆదాయాన్ని సమకూర్చే దుకాణాల సముదాయం, రైతు బజారు కూడా నిర్మాణం పూర్తి కావచ్చునట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గొల్లపూడి ఏఎంసి ఎంతో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతోందన్నారు. దీనికి భూములు ఇచ్చిన గొల్లపూడి రైతుల త్యాగఫలం స్ఫూర్తిదాయకం అన్నారు. గొల్లపూడి ఏఎంసి కమిటీని అభినందించారు. కూటమి సర్కారు సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కొనుగోలు చేసిన రోజుల వ్యవధిలోనే రైతులకు సొమ్ము చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్డీఏ కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.












# ముసలమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన పవన్ కళ్యాణ్





ఆదివారం చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం ముసలమడుగు వద్ద ఉన్న శిక్షణ కేంద్రానికి విచ్చేసిన ఆయన ఏనుగుల శిక్షణ, సంరక్షణ తదితర అంశాలను స్వయంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక నుంచి తెచ్చిన నాలుగు కుంకీ ఏనుగులతోపాటు, గతంలో ఇదే శిక్షణ కేంద్రంలో ఉన్న మూడు కుంకీలు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాయి. శిక్షణలో కుంకీ ఏనుగులు చూపుతున్న మెలకువలు, ఇటీవల జరిగిన ఆపరేషన్ల తీరును అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు ప్రత్యేకంగా చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. క్రమబద్ధంగా కుంకీ ఏనుగులు వరుసగా వస్తూ ఘీంకారం చేస్తూ పవన్ కళ్యాణ్ కి సెల్యూట్ చేశాయి. అనంతరం అడవిలో లభ్యమయ్యే వివిధ రకాల కలపను ఏనుగుల సహాయంతో ఎలా బయటకు తీసుకువచ్చేది ఏనుగుల చేత ప్రదర్శింపజేశారు. మానవ, ఏనుగుల మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు మదపుటేనుగుల గుంపు, నివాసాలు, పంట పొలాల వైపు వస్తున్నప్పుడు వాటిని ఎలా నియంత్రించాలో ప్రత్యక్షంగా కుంకీ ఏనుగుల చేత చేయించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మదపుటేనుగులు అదుపు తప్పినప్పుడు వాటికి ఓ ప్రత్యేకంగా మత్తు ఇచ్చి వాటి కోపాన్ని ఎలా అణిచి వేస్తారు అన్నది మావటీలు పవన్ కళ్యాణ్ కి చూపించారు. మత్తు ఇచ్చే ఇంజెక్షన్ గన్ ను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు చేసిన ప్రదర్శనలు ఉప ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏనుగులకు ఆయన స్వయంగా బెల్లం ఆహారం అందించారు. అనంతరం గజరాజుల ఆశీర్వచనం తీసుకున్నారు.



**- ముసలమడుగు ఏనుగుల క్యాంపు ప్రారంభోత్సవం**

అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో ముసలమడుగులో ఏర్పాటు చేసిన నూతన ఏనుగుల క్యాంపును ప్రారంభించారు. అందుకు సంబంధించిన శిలా ఫలకాన్ని ప్రారంభించారు. ఏనుగుల క్యాంపులో ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి పునాదిరాయి వేశారు. సౌర శక్తితో పని చేసే వేలాడే అటవీ ఏనుగుల నిరోధక కంచె నిర్మాణానికి పవన్ కళ్యాణ్ పునాది రాయి వేశారు.

**- మియావకీ తరహా ప్లాంటేషన్ కి శ్రీకారం**

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచడం ద్వారా అడవిని పెంపొందించే మియావకీ తరహా ప్లాంటేషన్ కు, ముసలమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్ర వద్ద పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. 250 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్లాంటేషన్ ను ఏర్పాటు చేశారు. ఉసిరి మొక్కను నాటి పవన్ కళ్యాణ్ ఈ దట్టమైన అడవుల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీటరకు ఒక్కటి చొప్పున నాటిన మియావకీ ప్లాంటేషన్ ను స్వయంగా మొబైల్ లో వీడియో తీసుకున్నారు. మధ్యన పొదలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**- మావటీలకి ఉప ముఖ్యమంత్రి రూ.50 వేలు బహుమానం**





కర్ణాటక ప్రభుత్వం నుంచి కుంకీ ఏనుగులను స్వీకరించేటప్పుడు వీటిని జాగ్రత్తగా చూసుకుంటామని పవన్ కళ్యాణ్ చెప్పారు. ఆ విధంగానే పలమనేరు ఎలిఫెంట్ క్యాంపులో మావటీలు.. కుంకీల సంరక్షణ బాధ్యతలు చూసుకుంటున్నారు. వారి పని తీరు మెచ్చుకుంటూ, పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులు రూ.50 వేలు బహుమానంగా అందించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, అనంతపురం, తిరుపతి ఫారెస్ట్ కన్జర్వేటర్లు యశోద బాయి, చిత్తూరు డీఎఫ్ఓ సుబ్బురాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ముంజేరు ఆలయ నిర్మాణానికి కర్రోతు రూ.50వేలు విరాళం

భోగాపురం:
మండలంలోని ముంజేరు గ్రామంలో వెలసిన శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ అండ్ నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు , మాజీ ఏ ఎం సి చైర్మన్ దంతులూరి సూర్యనారాయణరాజు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా బంగార్రాజు ముంజేరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న స్వామి వారి ఆలయానికి 50,000 రూపాయిలు , కొంగవానిపేట గ్రామంలో నిర్మిస్తున్న రామాలయానికి 10,000 రూపాయిలు సూర్యనారాయణ రాజు విరాళంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో ముంజేరు ఎంపీటీసీ పిడుగు వెంకటసత్యం , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భక్త కనకదాసు జయంతి వేడుకలు

తిరుపతి
శ్రీ శ్రీ దాస శ్రేష్ఠ భక్త కనకదాసు జయంతి వేడుకలను కురవ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సాహిత్యంతో సామాజిక విప్లవంసాధించవచ్చని నిరూపించిన మహానుభావుడు భక్త కనకదాసు అని కురుబ సంఘం నాయకులు కీర్తించారు. భక్త కనకదాసు 538వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కురబ కుల పెద్దలు, నాయకులు మరియు మిత్రులతో కలిసి ఘనంగా తిరుపతిలోని శ్రీ శ్రీ దాస శ్రేష్ఠ భక్త కనకదాసు విగ్రహం పూర్ణకుంభం సర్కిల్ నందు నిర్వహించారు. కనకదాసు జయంతి సందర్భంగా తిరుపతిలోని రుయా హాస్పిటల్ వద్ద పేదలకు, కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నంజుండప్ప , వలిగట్ల వెంకటరమణ ,ఆడిటర్ ఆనంద్, నారాయణ బాబు, ఆర్టీసీ సుబ్ర మన్యం, తిరుమల తిరుపతి కురబ కుల సేవాసంగం వ్యవస్థాపక అధ్యక్ష , కార్యదర్శులు కొల్లె ఇంద్రకుమార్,మరియు మేజారి నాగరాజు, డిల్లీ ప్రసాద్ మరియు వెలగపల్లి భాస్కర్, ఆవుల రవీంద్ర ,తిరుమల తిరుపతి కురుబ కుల సేవా సంఘం పాల్గొన్నారు.

# తారాపురం గిడ్డఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

**వైసిపి ఇన్చార్జి ఎర్రకోట రాజీవ్ రెడ్డి. రాష్ట్ర కార్యదర్శి.ఎర్రకోట.జగన్మోహన్ రెడ్డి వైసీపీ నాయకులు పాల్గొన్నారు**

ఎమ్మిగనూర్ పెద్ద కడుబూరు మండలం తారాపురం గ్రామంలో వెలసి భక్తజనుల మనసులను ఆవహిస్తున్న శ్రీ శ్రీ శ్రీ గిడ్డ ఆంజనేయ స్వామి వారిని ఈ రోజు భక్తి స్ఫూర్తితో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరునియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీ ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి సతీమణి శ్రీమతి నిరుపమా రెడ్డితో కలిసి స్వామివారి ఆశీర్వచనాలు పొందారుఈ పవిత్ర సందర్భంలో ఆలయం నిండా ఘంటా నాదాలు మారుమ్రోగగా, భక్తుల హృదయాలలో ఆంజనేయ స్వామి కరుణా జ్యోతి పరవళ్లు తొక్కింది. ప్రజా సేవలో ఎల్లప్పుడూ అగ్రగాములైన ఎర్రకోట కుటుంబం, భక్తి పూర్వకంగా స్వామివారికి శిరసు వంచి, ప్రజల శ్రేయస్సుకోసంఆశీర్వాదాలు కోరారు.ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,%శ్రీ%కార్యకర్తలు, భక్తులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని భక్తి వాతావరణాన్ని మరింత వైభవంగా మలిచారు జై శ్రీ గిడ్డ ఆంజనేయ స్వామి! భక్తితో సేవించే చేతులే ప్రజల హృదయాలను గెలుస్తాయి.

# డ్రంకన్ డ్రైవ్ కేసుల నిందితులకు జైలుశిక్ష విధించే విధంగా చర్యలు




– విజయనగరం: జిల్లాలోని బుదరాయవలస, తెర్లాం, బాడంగి, రామభద్రపురం , బొబ్బిలి పోలీసు స్టేషన్లను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ నవంబరు 9న సందర్శించారు. జిల్లా ఎస్పీ పోలీసు స్టేషన్ల పరిసరాలను పరిశీలించి, స్టేషను ప్రాంగణాలను సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషనులో పని చేసే పోలీసు సిబ్బందితో మమేకమై, వారి వివరాలను, సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకొన్నారు. పోలీసు స్టేషను ప్రాంగణంలోగల వివిధ కేసుల్లోని వాహనాలను నిబంధనలు మేరకు డిస్పోజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, పోలీసు స్టేషనులోనమోదవుతున్న కేసుల తీరును అధికారులను అడిగి తెలుసుకొని, సిడి ఫైల్స్, రికార్డులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్న డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు జైలుశిక్ష విధించే విధంగా చర్యలు చేపడతామన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులు, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు ఉండాలని, తద్వారా పోలీసుశాఖ ప్రతిష్ట పెరుగుతుందన్నారు. పోలీసు స్టేషను ప్రాంగణాలను ఆహ్లాదకరంగా, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పోలీసు స్టేషనులో ప్రధానంగా నమోదవుతున్న కేసులను గురించి, శాంతిభద్రతల సమస్యల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రహదారి భద్రత పట్ల వాహనదారులకు అవగాహన కల్పించాలని, రహదారి ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకై ఎప్పటికప్పుడు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి, పట్టుపడిన వారిపై కేసులు నమోదు చేసి, న్యాయస్థానం లో జైలు శిక్షలు పడే విధంగా చూడాలన్నారు. మహిళలు, బాలల భద్రతకు ప్రాధాన్యత కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ గురించి, ఆపద సమయంలో శక్తి ఎస్.ఓ.ఎస్.ను వినియోగించి, రక్షణ ఏవిధంగా పొందవచ్చునో మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు ‘గుడ్ టచ్ బ్యాడ్ టచ్’ వంటి సున్నిత అంశాలు పట్ల అవగాహన కల్పించాలని, ఇందుకు మహిళా సంరక్షణ పోలీసులు, శక్తి బృందాల సేవలను వినియోగించుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణ చర్యలు చేపట్టాలని, గంజాయిని వినియోగించే వ్యక్తులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి, వారిని కట్టడి చేయాలన్నారు. గంజాయి వినియోగించే వారికి గంజాయి ఎక్కడ నుండి సరఫరా అవుతున్నది గుర్తించి, వారిపై కేసులను నమోదు చేయాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువతను సన్మార్గంలో నడిపేందుకు కౌన్సిలింగు చేయాలన్నారు. సైబరు నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు సైబరు మోసాల తీరును వివరించి, సైబరు నేరగాళ్ళ ఉచ్చులో చిక్కుకోకుండా అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. డిజిటల్ అరెస్టు అన్న ప్రక్రియ పోలీసు వ్యవస్థలో లేదని, అమాయక ప్రజలకు సైబరు నేరగాళ్ళు వాట్సాప్ కాల్స్ చేసి, వారిని బెదిరించి, ఎక్కువ మొత్తంలో డబ్బులను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసుకుంటున్నారన్నారు. డిజిటల్ అరెస్టుల గురించి ప్రజలను అప్రమత్తం చేసి, క్షేత్ర స్థాయిలో అవగాహన చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. పోలీసు స్టేషన్లులో దర్యాప్తులో ఉన్న వివిధ కేసులను, రికార్డులను జిల్లా ఎస్పీ పరిశీలించి, ఆయా కేసుల్లో దర్యాప్తును పూర్తి చేయాలని, అధికారులకు జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ దిశా నిర్దేశం చేసారు.ఈ తనిఖీల్లో చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, బొబ్బిలి డిఎస్పీ భవ్యారెడ్డి, చీపురుపల్లి సిఐ జి.శంకరరావు, బొబ్బిలి రూరల్ సిఐ కే.నారాయణరావు, బొబ్బిలి సిఐ కే.సతీష్ కుమార్, ఎస్ఐలు లోకేశ్వరరావు, తారకేశ్వరరావు, సాగర్ బాబు, ప్రసాదరావు, జ్ఞాన ప్రసాద్, రమేష్ కుమార్ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూర్ ఈ ఇస్లాం మస్జీద్ లో గార్విన్ షరీఫ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి

**- ముఖ్యఅతిథిగా రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు**

గాజువాక నవంబర్09:( )
ముస్లిం మైనారిటీలకు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.గాజువాక 70 వ వార్డు,ఎల్ వి నగర్ లోని నూర్ ఈ ఇస్లాం మసీదులో గ్యారవి షరీఫ్ ఉత్సవాలు ఆదివారం జరిగాయి.ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లా పాల్గొన్నారు.ప్రత్యేక ప్రార్థనల అనంతరం పల్లాను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ముస్లింలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు.మజీద్ ముందు ఉన్న రోడ్డును అభివృద్ధి చేయడమే కాకుండా దీని పక్కనే షియా ముస్లింలకు మసీదు నిర్మాణానికై స్థలం కేటాయించినట్లు తెలిపారు.ఉత్సవాలలో భాగంగా ఖురాన్ చదివిన అనంతరంముఫ్టీ మహమ్మద్ జాఫర్ గార్వి షరీఫ్ యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాద్ శ్రీనివాసరావు, గాజువాక నియోజకవర్గం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ రెహమాన్, 70 వార్డు అధ్యక్షులు చట్టి గోపి, శంకర్రావు,66వ వార్డు అధ్యక్షులు గోమాడ వాసు, 66వ వార్డు వైస్ ప్రెసిడెంట్ ఆఫీస్ రెహమాన్, 66వ వార్డు మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ భాష, రతన్ కాంత్, మసీదు కమిటీ సభ్యులు సిలార్ బాబా, మహమ్మద్ భాయ్, రహీం, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.





# మాగంటి గోపీనాథ్ మరణంపై మాకు అనుమానాలు ఉన్నాయి

హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాగంటి మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్‌తో కలిసి మహానంద కుమారి పాత్రికేయులతో మాట్లాడారు. కేటీఆర్ వచ్చిన తర్వాత మరణవార్తను బయటకు చెప్పారు. గోపీనాథ్ 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై గొప్ప పేరు తెచ్చుకున్నారు. అలాంటి వ్యక్తి ఆస్పత్రిలో ఉంటే.. ఒక్క రోజు కూడా చూడటానికి టైమ్ ఇవ్వలేదు. ఒక్క అటెండర్‌ను కూడా పెట్టలేదు. గోపీనాథ్ జూన్ 8న చనిపోయారని చెప్పారు. లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మొదటి భార్య, బిడ్డలు, నా పేరు కూడా లేదు. మొదటి భార్యతో విడాకులు కూడా కాలేదు. నేను గోపీనాథ్‌తో సునీత పెళ్లి చేయలేదు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో మా పేరు లేదు. కేటీఆర్ వెంట పరుగెత్తి నాకు జరిగిన అన్యాయం గురించి చెప్పాలి అనుకుంటే ఆయన కూడా వినలేదు. ఇది డబ్బు సమస్య కాదు. మాకు గుర్తింపు లేదు. అందుకే మీడియా ముందుకొచ్చాం. తల్లిగా ఎంతో బాధపడుతున్నా. గోపినాథ్ తల్లిగా కేటీఆర్ తనను కనీసం కలవలేదు, సునీతకు టికెట్ ఇచ్చేటప్పుడు కేటీఆర్ మాకు కనీసం సమాచారం ఇవ్వలేదు. నాకు 93 ఏళ్ల వయసులో ఇలా బయటకు రావడం బాధగా ఉంది. మాకు ఏ పార్టీతో సంభందం లేదు. మాకు అన్యాయం జరిగింది. గోపీనాథ్ మొదటి భార్య, కుమారుడికి గుర్తింపు ఉండాలి కదా, మాలిని ఎంతో బాధపడుతోంది. ఎన్నో అవమానాలు పడింది. వద్దు అనుకుంటే మొదటి భార్యతో ఎప్పుడో విడాకులు తీసుకునేవాడు. అలా జరగలేదు అంటే.. సాఫ్ట్ కార్నర్ ఉన్నట్లే కదా. నలుగురిలో నిరూపించుకోవాలనే బయటకు వచ్చాం. నా పెద్ద కొడుకు కూడా టికెట్ కోసం ప్రయత్నించాడు. గోపీనాథ్ తల్లిగా నాకు అడగాల్సిన హక్కులేదా? లీగల్ హెయిర్ సర్టిఫికేట్‌లో మా పేర్లు లేవని ఆగస్టు 11 నుంచి తహసీల్దార్ కార్యాయానికి వెళ్లి వస్తున్నాం. ఈ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు అని అన్నారు.

**- మాకు గుర్తింపు లేదు : తారక్ ప్రద్యుమ్న**

నా పాస్‌పోర్ట్, ఇతర పత్రాల్లో తండ్రిగా గోపీనాథ్ పేరే ఉంది. చట్ట పరంగా కూడా అన్ని సక్రమంగా ఉన్నాయి. ఎమ్మార్వో ఆఫీస్ లో కూడా సబ్మిట్ చేశాను. మా అమ్మతో చట్టపరంగా విడాకులు కాలేదు. తారక్ అంటే ఎవరో తెలియదన్న మాగంటి సునీత.. జూన్ 6న నాకు మొదటి సారి ఫోన్ చేశారు. ఎవరో తెలియకపోతే.. ఎందుకు ఫోన్ చేసినట్లు? గ్రాడ్యుయేషన్ డేకి రావాలని మా నాన్న అనుకున్నారు. కానీ హఠాత్తుగా చనిపోయారు. సునీత నాకు ఫోన్ చేసి.. నువ్వు ఇండియా రావాల్సిన అవసరం లేదు. రెజ్యూమె పంపించు కేటీఆర్ అంకుల్ కంపెనీస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. మా పెద్దనాన్న మీద అనవసర ఆరోపణలు చేస్తున్నారు. జూన్ 25న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం అప్లై చేశారు. అప్పుడు అఫిడవిట్‌లో ఎవరి పేర్లు పెట్టారో నాకు తెలియదు. మా అమ్మ, నాన్నమ్మ, నా పేర్లను లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో పెట్టాలి అని కోరారు.

# కాకినాడ ఐడిఏ మరియు అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు దంత వైద్య పరీక్షలు

కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : స్థానిక రమణయ్యపేటలో కాకినాడ ఐడిఎ మరియు అడబాల ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రపంచ జెరియాట్రిక్ టూత్ డే సందర్భంగా వృద్ధులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ "జెరియాట్రిక్ టూత్ డే అనేది ప్రతి సంవత్సరం నవంబర్ 9న జరుపుకుంటారని, వృద్ధులలో దంత సంరక్షణ యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. వయసుతో పాటు దంత ఆరోగ్యం కూడా కీలకమని, వృద్ధులలో నోటి ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం, వయసుతో పాటు నోటి ఆరోగ్యం మొత్తం శ్రేయస్సుపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతుందని, కాబట్టి ఈ రోజున దాని ప్రాముఖ్యతను గుర్తు చేయబడుతుందని, ఈ రోజు దీర్ఘకాలిక సంరక్షణలో నివసించే వృద్ధులకు నోటి ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన తీసుకురావడం మరియు వృద్ధుల జీవన నాణ్యతను



పెంపొందించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలని అన్నారు. సీనియర్లలో నోటి ఆరోగ్యం, మొత్తం శరీర ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని, సరైన నోటి సంరక్షణ లేకపోవడం వల్ల న్యుమోనియా వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చని కొందరు నిపుణులు హెచ్చరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

# థార్, బుల్లెట్ నడిపేవారు పోకిరీలే.. హర్యానా డీజీపీ సంచలన వ్యాఖ్యలు

**- అలాంటి వాహనాలను తనిఖీ చేయకుండా వదిలిపెట్టబోమని స్పష్టం- వాహనం ఎంపికే వారి మనస్తత్వాన్ని తెలియజేస్తుందన్న ఓపీ సింగ్**

**- ఏసీపీ కుమారుడి ఘటనను ఉదాహరణగా పేర్కొన్న పోలీసు చీఫ్ - డీజీపీ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన**

హర్యానా, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : థార్ ఎస్‌యూవీలు, బుల్లెట్ మోటార్ సైకిళ్లు నడిపే వారి ప్రవర్తనపై హర్యానా డీజీపీ ఓపీ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అల్లరి చేసేవారు, పోకిరీలు ఎక్కువగా ఇలాంటి వాహనాలనే వినియోగిస్తారని, అందువల్ల వాటిని చూసీచూడనట్లు వదిలేయలేమని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. గురుగ్రామ్‌లో విలేకరులతో మాట్లాడిన ఓపీ సింగ్ (దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ బావ), వాహనాల తనిఖీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మేము రోడ్డుపై వెళ్లే అన్ని వాహనాలను ఆపి తనిఖీ చేయం. కానీ, ఒక థార్ కారు కనిపిస్తే దాన్ని ఎలా వదిలేస్తాం? బుల్లెట్ బైక్ కనిపించినా అంతే. ఎందుకంటే సమాజంలో అల్లరిచిల్లరగా తిరిగే వాళ్లంతా ఇలాంటి వాహనాలనే వాడుతున్నారు. ఒక వ్యక్తి ఎంచుకునే వాహనం వారి మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా థార్ నడిపేవారు రోడ్లపై స్టంట్లు చేస్తుంటారు" అని ఆయన అన్నారు. థార్ అనేది కేవలం ఒక కారు కాదని 'నేను ఇంతే' అని చాటిచెప్పే ఒక స్టేట్‌మెంట్‌గా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన ఒక







ఘటనను ఆయన ఉదాహరించారు. "ఒక అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) కుమారుడు థార్ కారుతో ఒకరిని ఢీకొట్టి చంపాడు. ఇప్పుడు తన కొడుకును విడిపించాలని ఆయన కోరుతున్నారు. కానీ ఆ కారు ఎవరి పేరు మీద రిజిస్టర్ అయిందని మేము అడిగాం. అది ఆయన పేరు మీదే ఉంది. కాబట్టి అసలైన పోకిరీ ఆయనే" అని డీజీపీ ఘాటుగా వ్యాఖ్యానించారు. సొంత శాఖలోని వారిని కూడా వదలకుండా "మన పోలీసు శాఖలో ఎంతమందికి థార్ కార్లు ఉన్నాయో జాబితా తీస్తే కచ్చితంగా ఆ కారు ఉన్నవాడికి కొంచెం పిచ్చి ఉంటుంది. గూండాయిజం చేస్తూ, అదే సమయంలో పట్టుబడకూడదంటే కుదరదు. ప్రదర్శన చేయాలనుకుంటే, దాని పర్యవసానాలను కూడా ఎదుర్కోవాల్సిందే" అని హెచ్చరించారు. సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు డీజీపీ ఓపీ సింగ్ వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయి చర్చించుకుంటున్నారు. కొందరు డీజీపీ చెప్పింది నిజమేనని, థార్, బుల్లెట్ వాహనాలు గూండాలకు గుర్తింపుగా మారాయని సమర్థిస్తున్నారు. మరికొందరు మాత్రం ఇలా సాధారణీకరించడం సరికాదని, రోడ్ల దుస్థితి, పోలీసుల బాధ్యత గురించి ప్రశ్నిస్తున్నారు. "బుల్లెట్ బైకులు వాడి ఎన్ని నేరాలు జరిగాయి? చైన్ స్నాచింగ్‌లు, హత్యలు జరిగాయా?" అని ఒకరు ప్రశ్నించగా, "డీజీపీ చెప్పింది అక్షరాలా నిజం. వారి నిర్ణయం ప్రశంసనీయం" అని మరొకరు మద్దతు తెలిపారు. ఇటీవల గురుగ్రామ్‌లో ఒక థార్ కారు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురిలో ఐదుగురు మరణించిన ఘటన ఈ ఆందోళనలకు మరింత బలం చేకూరుస్తోంది. బాధితుల చేతులకు పబ్ రిస్ట్‌బ్యాండ్‌లు ఉండటంతో వారు పార్టీ నుంచి వస్తున్నట్లు పోలీసులు భావించారు. ఈ నేపథ్యంలో డీజీపీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి

# లింగోలు సత్యవతికి ఆర్థిక సాయం


**- అందజేసిన టీమ్ నేను సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు**

రావులపాలెం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : రావులపాలెం గ్రామానికి చెందిన లింగోలు సత్యవతి క్యాన్సర్ కారణంగా బాధపడుతు, ఆర్థికంగా చాలా ఇబ్బందులుపడుతున్నారని తెలిసి టీమ్ నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ దృష్టికి రావడంతో సంస్థ వ్యవస్థాపకుడు అంబటి కిషోర్ ఆధ్వర్యంలో సహాయానిధిని ఏర్పాటు చేసి విరాళాలు ద్వారా



వచ్చిన రూ.15వేలను ఆదివారం నాడు సత్యవతి ఇంటికి వెళ్లి వైద్యసహాయం నిమిత్తం సంస్థ సభ్యులు అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో సంస్థ సభ్యులు విక్టరీ బద్రి, అవినాష్ చౌదరి టీమ్ నేను సైతం ఆడపడుచులు కొవ్వూరి రేణుక రెడ్డి, కంఠంశెట్టి దేవి శ్రీనివాస్, ఆకుల జ్యోతి పాల్గొన్నారు.

# ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్న హైదరాబాదీ అరెస్ట్



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : దేశంలో ఉగ్రదాడులకు కుట్ర చేస్తున్న ముగ్గురిని గుజరాత్ టెర్రరిస్ట్ స్క్వాడ్ అరెస్టు చేసింది. దాడులు చేసేందుకు ఆయుధాలు సరఫరా చేస్తున్నారని ఆ రాష్ట్రంలో టోల్ ప్లాజా సమీపంలో అరెస్ట్ చేశారు.దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉగ్రదాడులు చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు ఏటీఎస్ అధికారులు గుర్తించారు. పట్టుబడిన వారిలో హైదరాబాద్ కు చెందిన సయ్యద్ అహ్మద్ మొయిద్దీన్ ఉండటం నగరంలో కలకలం రేపుతోంది.

# వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ స్పీకర్ చింతకాయల అయ్యనపాత్రుడు

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : కోనసీమ తిరుమల శ్రీ వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వారి కుటుంబంతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తెదేపా యువనాయకులు బండారు సంజీవ్ ఆయన వెంట ఉన్నారు. శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు మరియు కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం



స్పీకర్ అయ్యన్నపాత్రుడు సకుటుంబంగా స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమీషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు శాసనసభాపతికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# అంగరంగ వైభవంగా జగ్గంపేట కాపు సంఘం వన సమారాధన మహోత్సవం

?

**- హాజరైన ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు వివిధ పార్టీల ప్రతినిధులు**

**- కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ పది లక్షలు గ్రాంట్ ప్రకటన, జగ్గంపేట ఎమ్మెల్యే సొంత నిధులతో భోజనశాల, వంటగది, వాచ్ మ్యాన్ రూమ్ నిర్మాణం**


జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 : జగ్గంపేట కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మీసాల చిన్నబాబు ఆధ్వర్యంలో కాపు వనభోజన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జగ్గంపేట పరిసర ప్రాంతాల నుంచి 5000 మంది కాపు కుటుంబాల నుంచి హాజరై ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్ కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, తోట త్రిమూర్తులు, వరుపుల సుబ్బారావు, వంగా గీతా విశ్వనాథ్, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, కాకినాడ మాజీ మేయర్ నాగిరెడ్డి చంద్రకళ దీప్తి, జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, అరుణాచల మాధవి, కాపు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల కాపు నాయకులు హాజరై ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం చిన్నారుల కూచిపూడి నాట్యాలతో ఆహుతులను అలరించారు. అనంతరం అరుణాచల మాధవి తన ప్రవచనాలతో పరమశింపజేశారు. జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ క్విజ్ పోటీల ద్వారా సేకరించిన లక్ష 14 వేల రూపాయలు కాపు సంక్షేమానికి ఉపయోగించాలని సంఘ అధ్యక్షుడు మీసాల చిన్నబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాపు సామాజిక భవనానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షలు గ్రాంటు అందిస్తానని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇంతటి చక్కని కార్యక్రమాన్ని రూపొందించిన జగ్గంపేట కాపు సంక్షేమ సంఘాన్ని అభినందిస్తున్నానని అన్నారు. కాపు సామాజిక భవనానికి అన్ని రకాల ఫంక్షన్ లు నిర్వహించాలంటే భోజనశాల, వంటగది, వాచ్ మ్యాన్ రూము అవసరమని వీటిని తన సొంత నిధులతో తన





తండ్రి జ్యోతుల నాగేశ్వరరావు పేరు మీదుగా తొందర్లోనే నిర్మాణం చేపడతానని అన్నారు. అదేవిధంగా 10 అతిథి రూములు, నిర్మించేందుకు దాతలు ముందుకు వస్తే వారి పేర్లు మీద నిర్మించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల మణి, తోట సునీత, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, జీను పెద్ద రాంబాబు, బండారు రాజా, మారిశెట్టి భద్రం, దవులూరి ఈశ్వరరావు, మారిశెట్టి రాధా, తోలేటి సూర్యనారాయణ, తులా నరసింహారావు, కురుమళ్ళ నాగేశ్వరరావు, రాయి సాయి, అంగజాల బ్రహ్మాజీరావు, మసకపల్లి భైరవస్వామి, పురె సూరన్న, తోట బుచ్చిరాజు, సూరపరెడ్డి నరేష్, గేడ్డమూరి బాబ్జి, మారిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు



పిఠాపురం , సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 09 :
ఆదివారం ఉదయం పిఠాపురం ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలమూలల నుండి 300 మంది బాక్సింగ్ బాల బాలికల పాల్గొన్నారు. ఈ పోటీలను కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం, ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సురేష్ కుమార్, జిల్లా రగ్బి అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రమన్నరాజు ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం బహుమతి ప్రధానం చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయతలుగా యు.లోవరాజు, జి.శివప్రసాద్, పి.అచ్చిరాజు, బి.సతీష్



వ్యవహరించారు అని పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీలు ఓవరాల్ ఛాంపియన్గా పిఠాపురం మొదటి స్థానం, రెండో స్థానంలో భావారం, మూడో స్థానంలో కత్తిపూడి నిలిచిందన్నారు.




Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com